క్లుప్తంగా

కౌలు రైతులకు 'సుఖీభవ' అమలు చేయాలి

కౌలు రైతు సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు జి.నాగరాజు

భట్టిప్రోలు: కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని కౌలు రైతు సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు జి.నాగరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం తహసీల్దార్ మేకా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందచేశారు. నాగరాజు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అధికంగా కౌలు రైతులు ఉన్నారని, వారందరికీ అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలన్నారు. కౌలు చేస్తున్న ప్రతి ఒక్కరికి సీసీఆర్సీ కార్డు ఇవ్వాలని కోరారు. నాయకులు జి.సుధాకర్, రాంబాబు, మురుగుడు సత్యన్నారాయణ, పి.మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన



చుండూరు(వేమూరు): విద్యార్థుల్లో భావోద్వేగ ఆరోగ్యం, ఏకాగ్రత, ధైర్యం పెంపొందించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని స్టేట్ పీఎం యూ కో–ఆర్డినేటర్ కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ డాక్టర్ కె.పి.వెంకట సుబ్బయ్య తెలిపారు. చుండూరు మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గురువారం విద్యార్థులకు కెరీర్, మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ జి.యోహోషువ, జిల్లా కెరీర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ గంటా ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

బోడపాడులో 'రచ్చబండ'



అమర్తలూరు(వేమూరు): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అమర్తలూరు మండలం బోడపాడులో గురువారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు గేరా ప్రతాప్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పార్టీ గ్రామ పరిశీలకులు గుమ్మడి రవి రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన తర్వాత పేదలకు వైద్యం దూరం చేసే కుట్రలకు దిగిందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తు రచబండ కార్యక్రమంలో కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం కోటి సంతకాల కార్యక్రమం పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాకిరి సాంబశివరావు, మిక్కిలి చిరంజీవి, షేక్ హర్లి, తలతోటి సందీప్, షేక్ బుడే, దేవరపల్లి అనిల్, మోపర్తి సురేష్, కొండ్రు బాబురావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపరచండి

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు అందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జె.ఆర్.అప్పలనాయుడు సూచించారు. పట్టణంలోని 5,6 శానిటేషన్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. ముందుగా అంటిడెన్స్‌ను పరిశీలించారు. ప్రతి రోజు చెత్తను సకాలంలో సేకరించాలని సూచించారు. పట్టణానికి మంచి పేరు తీసుకువచ్చే విధంగా అందరూ కృషి చేయాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

తెనాలిఅర్బన్: మురుగు సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. ఒకటో వార్డులో గురువారం జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించారు. కాల్వల్లో వ్యర్థాలు ఉండటాన్ని గమనించిన ఆమె సిబ్బంది పై అసహనం వ్యక్తం చేశారు. ప్రతిరోజు కాల్వలు బాగు చేయాలని సూచించారు. ఆమె వెంట ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు, టీపీఓ సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఏఈ రాజు, తదితరులు ఉన్నారు.

23న చిన్న పిల్లల గుండె వైద్య శిబిరం

తెనాలిఅర్బన్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెనాలి జిల్లా వైద్యశాలలోని డైక్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 23 తేదీన చిన్న పిల్లల ఉచిత గుండె శిబిరం నిర్వహించనున్నట్లు డైక్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మధుబాబు గురువారం తెలిపారు. రమేశ్ హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ చిన్న పిల్లల గుండె వైద్య నిపుణులు శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. గుండెకు సంబంధించిన టుడీకో, ఈసీజీ తదితర అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తారన్నారు. జిల్లా వైద్యశాల ఆవరణలోని డైక్ సెంటర్‌లో ఉదయం 9 గంటల నుంచి వైద్యశిబిరం ప్రారంభమవుతుందన్నారు. గుండెజబ్బుతో బాధపడే చిన్నారులకు శస్త్ర చికిత్సలు కూడా చేస్తారని తెలిపారు.

అందని ద్రాక్షగా వైద్యం, వైద్య విద్య

- వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్
- రేపల్లె 1,16 వార్డుల్లో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ



ఒకటో వార్డులో కోటి సంతకాలపై ప్రచారం చేస్తున్న డాక్టర్ ఈవూరు గణేష్

రేపల్లె: రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తే వైద్యం వ్యాపారంగా మారి సామాన్యులకు వైద్యం అందని ద్రాక్షపండుగా మారుతుందని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న కోటిసంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాన్ని పట్టణంలోని 1, 16వవార్డులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ గణేష్ మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్యంతో పాటు పేద విద్యార్థులు, ప్రతిభావంతులైన విద్యార్థులకు వైద్య విద్యను అందించే లక్ష్యంతో కళాశాలల ఏర్పాటుకు పూనుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్య సాధనకు తూట్లుపొడుస్తూ కూటమి ప్రభుత్వం రాజకీయ దృక్పథంతో ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకోవటం అవివేకమన్నారు. పేదలకు వైద్యం అందించే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నెలకొల్పిన వైద్య కళాశాలలను ప్రభుత్వం అజమాయిషీలో కాకుండా ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే పేదలకు వైద్యం ప్రియం అవుతుందన్నారు. నిజంగా ప్రజల శ్రేయస్సు కోరుకుంటే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయంపై పునరాలోచించి మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విరమించుకోవాలన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

రాష్ట్రంలో ప్రజలు కూటమి సంవత్సర పాలనపై విసిగి వేసారిపోయారని, రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని డాక్టర్ గణేష్ విమర్శించారు. ప్రభుత్వ అవినీతిపై ప్రశ్నించేవారిపై తమ జులుం ప్రదర్శించటం, అక్రమ కేసులు బనాయించటం పరిపాటిగా మారిందన్నారు. కూటమి నాయకుల కనుసన్నలలో పోలీసు వ్యవస్థ సైతం పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారుతోందని, ఆ మద్యం తాగి పలువురు మృతి చెందితే ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవటం విచారకరమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్ని ఉత్తుత్తి గ్యాస్ మాదిరిగా ఉందన్నారు. ప్రజలు అంతా గమనిస్తూనేఉన్నారని, ఇకనైనా కూటమి నాయకులు తమ తీరు మార్చుకోకుంటే మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. కూటమి ప్రభుత్వ పాలన వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు, జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు చిమటా బాలాజీ, చిత్రాల ఓబేదు, జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకట కృష్ణారెడ్డి, చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పట్టెం శ్రీనివాసరావు, నియోజకవర్గ మహిళా విభాగం కన్వీనర్ వీసం నాగలక్ష్మి, నాయకులు ఖుద్దూష్, కొలుసు బాలకృష్ణ, డాక్టర్ అతిక్, శొంఠి సురేష్, ఆలా రాజ్ పాల్, సజ్జా పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులు అమలు చేయాలి

ఎంపీడీఓకు అంగన్‌వాడీలు వినతి



భట్టిప్రోలు ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

భట్టిప్రోలు: ఐసీడీఎస్ నింబంధనలు లేని పనులకు అంగన్‌వాడీలను వినియోగించవద్దనే మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ భట్టిప్రోలు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు గురువారం వినతిపత్రం అందచేశారు. వర్కర్స్ యూనియన్ నాయకురాలు వాకా గృహలక్ష్మి, సీఐటీయూ జిల్లా సహాయక కార్యదర్శి పి.మనోజ్‌కుమార్‌లు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐసీడీఎస్‌కు సంబంధం లేని పనులు, పింఛన్ డ్యూటీలు వేయవద్దని శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ నుంచి వచ్చిన ఉత్తర్వులు ఉన్నాయన్నారు. అయినా రెండు నెలల నుంచి డ్యూటీలు వేస్తున్నారని, తమ విధులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. నవంబర్ నెల నుంచి వారిస్థానాల్లో మరొకరిని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జి.సుధాకర్, భట్టిప్రోలు, వెల్లటూరు సెక్టార్ల నిర్వాహకులు రూపరాణి, వరలక్ష్మి, వాణి వెంకటరమణ, కాంతమ్మ, వెంకటేశ్వరమ్మ, భద్రకాళి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ



బాపట్ల: గ్రామీణ మహిళా స్వయం ఉపాధి కల్పనతో ఆర్థిక స్వావలంబన సాధ్యమని ఎస్‌టూ నీడి ఫౌండేషన్ అధ్యక్షుడు తోట సురేష్ బాబు పేర్కొన్నారు. మండలంలోని విజయలక్ష్మీపురం మత్స్యకార మహిళలకు శిక్షణ ఇచ్చి ఉచితంగా మిషన్లు పంపిణీ కార్యక్రమం గురువారం చేపట్టారు. ఒంటరి మహిళలుగా ఉంటున్న చోడిపల్లి అప్పల నరసమ్మ, అరికెల వెన్నెలకు ఉచితంగా మిషన్లు పంపిణీ చేశారు. మత్స్యకార గ్రామాల్లోని బడి మానుకున్న పిల్లలను ప్రత్యేకంగా పాఠశాలలో చేర్పించటంతో పాటు మహిళలకు కుట్టుమిషన్లుపై శిక్షణ ఇప్పించి మిషన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అడవిపల్లిపాలెం స్థానిక నాయకులు శివ గోగు, నైపుణ్య శిక్షకురాలు కుందేటి కుమారి, మద్దిబోయిన స్వప్న, టి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార లోపాల నివారణకు కృషి



భట్టిప్రోలులో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం



రేపల్లెలో అంగన్‌వాడీలను సత్కరిస్తున్న అధికారులు

ముగిసిన 'రాష్ట్రీయ పోషణ మాసోత్సవం'

భట్టిప్రోలు: తల్లులు సమగ్ర పోషణ తీసుకుంటే పుట్టబోయే పిల్లలు ధృడంగా, ఆరోగ్యవంతంగా ఉంటారని ఎంపీపీ, సర్పంచ్ దావూరి వెంకట లలితకుమారి, దారా రవి కిరణ్మయిలు పేర్కొన్నారు. భట్టిప్రోలు సెక్టార్ పరిధిలో రాష్ట్రీయ పోషణ మాసం–2025 ముగింపు కార్యక్రమం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో గురువారం జరిగింది. సూపర్‌వైజర్ బి. సంపూర్ణ అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ చిన్న పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని గుర్తించి వారికి సమగ్ర పోషణ అందించడమే ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యమని తెలిపారు. అమృతలూరు సీడీపీఓ ఎ.లక్ష్మిదేవి మాట్లాడుతూ సెక్టార్ పరిధిలోని అన్ని గ్రామాలలో ఈ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా జరుగిందని స్థూలకాయ నివారణ, చక్కెర, నూనెల వినియోగం ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడం, బాల్య దశ సంరక్షించడం, తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, మండల సమాఖ్య ఏపీఎం బి.సంపూర్ణ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది..

రేపల్లె: ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది ఆరోగ్యవంతమైన కుటుంబమేనని సీడీపీఓ ఎం.సుచిత్ర చెప్పారు. పోషకాహారం – ఆరోగ్యానికి పునాది కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవ ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషణపై అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. గర్భిణులు పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు ఉండే ఆహారంపై అవగాహన ఉండాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనలు నిర్వహించారు. అదేవిధంగా 40 సంవత్సరాలపాటు సేవలు అందించిన అంగన్‌వాడీలను సత్కరించారు. తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు కలిగి ఉండే వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయుర్వేదిక్ వైద్యురాలు మాధవి, సూపర్‌వైజర్‌లు సీహెచ్ హిమబిందు, తుమ్మ రాధిక, మంజుల, నాగలక్ష్మి, బీపీసీ అరుణ, సీఆర్ఏఎఫ్ ఆర్గనైజేషన్ అధికారి శ్రీనివాస్, ఎన్‌జీఓ ప్రెసిడెంట్ అంకమ్మరావు, సెక్రటరీ గంగాధర్, కోశాధికారి శ్రావణ్, ఉపాధ్యక్షులు నరేంద్ర, ఐల్లయ్య, సభ్యులు శ్రీనివాస్, సుభాషిణి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బోడపాడులో..

అమర్తలూరు(వేమూరు): తల్లులు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందించే ఆహారం పిల్లలకు పెట్టాలని అమర్తలూరు సీడీపీఓ ఎ.లక్ష్మి తెలిపారు. అమర్తలూరు మండలంలోని బోడపాడు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 16 వరకు పోషణ మాసోత్సవాలు నిర్వహించడం జరిగిందన్నారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఉపసర్పంచ్ దర్శి అశోక్, మహిళా పోలీసు వరలక్ష్మి, తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆడపిల్లలపై వివక్ష వీడాలి



వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక



మాట్లాడుతున్న సీడీపీఓ విజయగౌరి

తెనాలిఅర్బన్: సమాజంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానమేనని, ఆడపిల్లలపై వివక్ష వీడాలని నందులపేటలోని అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక సూచించారు. ఆరోగ్య సిబ్బందితో గురువారం అర్బన్‌హెల్త్ సెంటర్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియ నిషేధ చట్టం అనుసరించి అందరూ నడుచుకోవాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు ఎవరు చేయకూడదని సూచించారు. ఆడపిల్లల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గర్భస్థ పిండ హత్యకు పాల్పడితే చట్టపరంగా శిక్ష తప్పదని హెచ్చరించారు. సమావేశంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, హెచ్‌వీ చింతల ప్రసన్న పుష్పలత, సిబ్బంది బండారు మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు దూరంగా ఉండండి..

తెనాలిఅర్బన్: బాల్య వివాహాలకు బాలికలు దూరంగా ఉండాలని తెనాలి సీడీపీఓ విజయగౌరి సూచించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవ వేడుకల్లో భాగంగా చెంచుపేటలోని కోగంటి శివయ్య హైస్కూల్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు చదువుపై దృష్టి పెట్టి ఉన్నతంగా ఎదగాలన్నారు. బాల్య వివాహాలపై తమకు సమాచారం అందించాలని సూచించారు.


తెనాలిలో విద్యుత్ విజిలెన్స్ విస్తృత తనిఖీలు



సమావేశంలో మాట్లాడుతున్న పర్యవేక్షక ఇంజినీర్ చిరంజీవి

తెనాలిటౌన్: మీటర్ ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ విజిలెన్స్ విభాగం పర్యవేక్ష ఇంజినీర్ వీవీ చిరంజీవి హెచ్చరించారు. రూరల్ మండలంలోని అంగలకుదురు, గుడివాడ, కొలకలూరు, కోపల్లె, సంగం జాగర్లమూడి, కంచర్లపాలెం, కఠెవరం, నందివెలుగు గ్రామాల్లో విజిలెన్స్, ఆపరేషన్ విభాగం ఆధ్వర్యంలో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. 3,358 సర్వీసులు తనిఖీలు చేసి పలు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో విజిలెన్స్ విభాగం పర్యవేక్షక ఇంజినీర్ వీవీ చిరంజీవి మాట్లాడుతూ మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అనుమతించిన లోడ్ కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 34 మందిని గుర్తించి రూ.1.46 లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. మొత్తం రూ.2.26లక్షల అపరాధ రుసుము విధించినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో 45 మంది అధికారులు, 135 మంది సిబ్బంది పాల్గొని 3,358 సర్వీసులు తనిఖీ చేసినట్లు తెలిపారు. విద్యుత్ చట్టానికి లోబడి మీటర్లకు తప్పని సరిగా సీల్ ఉండేటట్లు నిర్ధారించుకోవాలని చెప్పారు. సీల్ లేకపోయిన, తుప్పుపట్టి ఊడిపోయిన వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. పని చేయని మీటరు నుండి విద్యుత్ వాడుకున్న ఉండవల్సిన మీటరుకు బదులు వేరే మీటరు పెట్టి సీల్ లేకపోయిన విద్యుత్ చౌర్యంగా నిర్ధారణ చేయబడుతుందని వివరించారు. మొదటి తప్పిదానికి అపరాధ రుసుము, రెండోవ తప్పిదానికి అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపడం జరుగుతుందన్నారు. అపరాధ రుసుము కట్టలేని పరిస్థితిల్లో రెవెన్యూ రికవరీ చట్టం ఉపయోగించి ఆస్తులు జప్తు చేయడం జరుగుతుందన్నారు. మొదటి తప్పిదానికి మూడు రెట్లు, రెండోసారి ఆరు రెట్లు జరిమానా విధిస్తామని చెప్పారు. సమావేశంలో తెనాలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అక్కల సత్యనారాయణ, విజిలెన్స్ డీఈ ఎస్‌పి కరీమ్, రూరల్ డీఈ కె.రాజశేఖర్, డీఈలు ఎన్.మల్లిఖార్జునప్రసాద్, కె.రవికుమార్, ఎస్.శ్రీనివాసరావు, బి.అశోక్‌కుమార్, ఏఈలు టి.వెంకట్రావు, యు.శివశంకర్, కె.కోటేశ్వరరావు, ఎం.సతీష్‌కుమార్, తదితరులు ఉన్నారు.

19న వెరికోస్ వీన్స్ ఉచిత వైద్యశిబిరం



కరపత్రాన్ని ఆవిష్కరించిన ఈదర వెంకట పూర్ణచంద్

తెనాలి: రోటరీక్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఈనెల 19న స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని బీసీ కాలనీలో గల పట్టణ రంగస్థల కళాకారుల సంఘ భవనంలో ఉచిత వెరికోస్ వీన్స్ వైద్యశిబిరం నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని ఏషియన్ వాస్క్యులర్ హాస్పిటల్ సహకారంతో జరిపే ఈ వైద్యశిబిరం వివరాలను రోటరీ క్లబ్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ ఆదివారం జరిగే వైద్యశిబిరంలో వెరికోస్ వీన్స్ సమస్య కలిగిన ప్రతిఒక్కరూ వచ్చి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఈ వైద్యశిబిరంలో రూ.5 వేల విలువైన పరీక్షలను ఉచితంగా చేస్తారని తెలిపారు. పట్టణ రంగస్థల కళాకారుల్లో అవసరమైన వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాకారుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు కోరారు. రోటరీ డిస్ట్రిక్ట్–3150 అమరావతి రీజియన్ క్యాన్సల్ ఎవర్నెస్ చైర్మన్ కన్నెగంటి మురళీకృష్ణ, క్లబ్ కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, పావులూరి రాంబాబు, ఈదర శ్రీనివాసరావు, జగదీశ్వరాంబ పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్యం దూరం

ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి, చిత్రంలో పరిశీలకులు ప్రతాప్ కుమార్

పెదపులివర్రు(భట్టిప్రోలు): కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను, పేదలకు ఉచిత వైద్యాన్ని దూరం చేస్తోందని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయొద్దంటూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం గురువారం భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని అక్కివారిపాలెంలో గ్రామ పార్టీ సమావేశం నిర్వహించారు. పార్టీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు ఆదేశానుసారం నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వల్ల పేదలకు, ప్రజలకు నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పరిశీలకులు బొల్లెద్దు ప్రతాప్ కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వర కుమార్, పార్టీ వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో మంచి అవకాశాలు

ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవిచంద్రకుమార్



దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి ఉదయ్‌కుమార్

రేపల్లె: పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ – 22 ఆంధ్రా బెటాలియన్ తెనాలి ఆధ్వర్యంలో డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఎన్‌సీసీ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవిచంద్రకుమార్ మాట్లాడుతూ నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)తో విద్యార్థులలో కేవలం క్రమశిక్షణ మాత్రమే కాకుండా నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సేవాభావం, ఉన్నత ఆశయాలు పెంపొందుతాయని చెప్పారు. 22 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎ.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం తరగతి గదులలో చదువుకే పరిమితం కాకుండా క్రీడలు, ఎన్‌సీసీ వంటి వాటిలోనే రాణించాలన్నారు. ఎన్‌సీసీలో రాణించిన వారి భవిష్యత్ బాగుంటుందని సూచించారు. అనంతరం విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించి నమోదు కార్యక్రమం చేశారు. పరీక్షలలో తొమ్మిది మంది బాలురు, ఆరుగురు బాలికలు ఎంపికైనట్లు కమాండింగ్ అధికారి పేర్కొన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ కె.బాలగురవయ్య, ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు పాల్గొన్నారు.

గాలి కాలుష్యంపై సదస్సు..

పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గాలి కాలుష్యంపై గురువారం అవగాహన సదస్సునిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారి ఎం.దాసు, రసాయన శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ వీవీ రవీంద్ర, బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన



డాక్టర్ పీవీ కృష్ణను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ హరికృష్ణ, అధ్యాపకులు

నగరం: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించేవిధంగా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హరికృష్ణ చెప్పారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో గురువారం జువాలజీ–ఆక్వాకల్చర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సుస్థిర మత్స్యసంవర్ధనం–వ్యాధుల నియంత్రణ అనే అంశంపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పర్యావరణానికి హని కలగకుండా సాగుచేయడం వల్ల సహజవనరులను రక్షించుకోవచ్చునన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ పీవీ కృష్ణ మాట్లాడుతూ ఆక్వా కల్చర్ కార్యకలాపాల నిర్వహణ సక్రమంగా లేకపోతే పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. అనంతరం డాక్టర్ పీవీ కృష్ణను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కళాశాల హెచ్ఓడీ కె.సురేష్ బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రేతలు అనుమతులు తీసుకోవాలి

భట్టిప్రోలు ఎస్ఐ ఎం.శివయ్య

భట్టిప్రోలు: బాణసంచా విక్రేతలు విధిగా అనుమతి తీసుకుని, దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని భట్టిప్రోలు ఎస్ఐ ఎం.శివయ్య గురువారం పేర్కొన్నారు. స్థానిక పీఎస్‌లో ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోని బాణసంచా దుకాణదారులు తప్పనిసరిగా పోలీస్, రెవెన్యూ, ఫైర్ సిబ్బంది నుంచి అనుమతి తీసుకుని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమతులు లేనివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.